WWW.EPAPER.MAHADAILY.COM

మహా పత్రిక

ఖమ్మం

భద్రాద్రి కొత్తగూడెం

21-12-2025





02

## భద్రాద్రి ముక్కోటి ఉత్సవాలకు రండి

పవిత్ర ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో నిర్వహించనున్న ఉత్సవాలకు రంగం సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు దేవస్థాన అధికారులు అధికారికంగా ఆహ్వానం పలికారు.

# జర్నలిస్టుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

## మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

10



- ఈ నెలలోనే అక్రిడేషన్లకు జీవో విడుదల.. విధి విధానాలు ఖరారు చేస్తున్నాం..
- ఈ సంవత్సరం అక్రిడిటేషన్ల ప్రక్రియ.. కొత్త సంవత్సరం ఇంటి జాగలపై తీపి కబురు
- టీడబ్ల్యూజేఎఫ్ మహాసభలో రెవెన్యూ, హౌసింగ్, ఐఅండ్ పీఆర్ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- జర్నలిస్టులకు మాది అనుకూల ప్రభుత్వం: ఎమ్మెల్యే రాగమయి
- టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ ఎన్నిక, అధ్యక్ష, కార్యదర్శులుగా ఖదీర్, శ్రీనివాస్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ గా సాగర్ దువ్వ

ఖమ్మం
మహా

జర్నలిస్టుల అక్రిడిటేషన్ ప్రక్రియ మరో పదిరోజుల్లో ప్రారంభిస్తామని రెవెన్యూ, హౌసింగ్, ఐఅండ్ పీఆర్ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ సంవత్సరం చివరికి అక్రిడిటేషన్ల ప్రక్రియ, వచ్చే ఏడాది జర్నలిస్టుల ఇండ్ల స్థలాల కేటాయింపుపై తీపి కబురు చెబుతామని స్పష్టం చేశారు.

### జర్నలిస్టులకు అనుకూలంగా ఉంటాం సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి

కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టులకు అనుకూలంగా ఉంటుందని, వారి సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తుందని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు.

తన నియోజకవర్గంలో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలతో పాటు పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు వెల్లడించారు.



## లంచావతారాల గుట్టు రట్టు!

ఖమ్మం జిల్లా రవాణా శాఖ కార్యాలయం వేదికగా సాగుతున్న అక్రమ దందాలపై " అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఉక్కుపాదం మోపారు. శనివారం జిల్లా రవాణా శాఖ కార్యాల యంలో ఏసీబీ బృందం నిర్వహించిన మెరుపు దాడులు పెను సంచలనం సృష్టించాయి.

07



03

## పాడే మోసి.. కంటతడి పెట్టి..

రాజకీయం అంటే కేవలం పదవులు... అధికార దర్పం మాత్రమే కాదు.. అంతకు మించిన ఆత్మీయ అనుబంధమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిరూపించారు. పార్టీ పటిష్టత కోసం కృషి చేస్తూ... తన వెన్నంటి నడిచిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు యడవల్లి రామిరెడ్డి అకాల మరణం ఆయన్ని తీవ్రంగా కలచివేసింది.



### రాజ్యాంగాన్ని కాపాడవలసిన బాధ్యత

## ప్రతి ఒక్కరిపై ఉంది

భారత రాజ్యాంగాన్ని కాపాడవలసిన బాధ్యత కేవలం న్యాయస్థానాలకు, న్యాయవాదులకు మాత్రమే కాకుండా ప్రతీ ఒక్క పౌరునిపై ఉందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ స్పష్టం చేశారు.

05

## లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

### పోలీస్ కమిషనర్ సునీల్ దత్ విజ్ఞప్తి



**ఖమ్మం, మహా:** ఈ నెల 21 వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ విజ్ఞప్తి చేశారు. చిన్న చిన్న కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ...ఆర్థిక భారంతో పాటు సమయాన్ని వృథా చేసుకోవద్దని సూచించారు. జాతీయ లోక్ అదాలత్ ద్వారా ఇరువైపుల సమ్మతితో సమస్యలను త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశం అందుబాటులో ఉందని తెలిపారు. రాజీ చేసుకునే అవకాశమున్న వివిధ రకాల కేసులు క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి విభజన కేసులు, వైవాహిక జీవితం కుటుంబ సమస్యలకు సంబంధించిన కేసులు, డ్రంకన్ డ్రైవ్, మోటారు వాహన చట్ట ఉల్లంఘనలు, చెక్ బౌన్స్ కేసులు, బ్యాంకు రికవరీ కేసులు, విద్యుత్ చౌర్యం తదితర కేసులు పరిష్కరించుకోవచ్చు అని వివరించారు. న్యాయశాఖ అందిస్తున్న ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని సూచించారు.

# భద్రాద్రి ముక్కోటి ఉత్సవాలకు రండి

- మంత్రి తుమ్మలను కలిసిన భద్రాద్రి ఈఓ
- ముక్కోటి ఏకాదశికి అధికారిక ఆహ్వానం
- మంత్రి తుమ్మలకు ఆహ్వానం
- సంప్రదాయబద్ధంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు






**ఖమ్మం, మహా:** పవిత్ర ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో నిర్వహించనున్న ఉత్సవాలకు రంగం సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు దేవస్థాన అధికారులు అధికారికంగా ఆహ్వానం పలికారు. శనివారం ఖమ్మంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో భేటీ అయిన అధికారులు, ఉత్సవాల నిర్వహణపై మంత్రి సూచనలు తీసుకున్నారు.ముక్కోటి ఏకాదశి వేడుకలను పురస్కరించుకుని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థాన కార్యనిర్వాహణ అధికారి (ఈఓ) దామోదర్ శనివారం ఖమ్మం క్యాంపు కార్యాలయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను అందజేసి, మంత్రిని వేడుకలకు రావాల్సిందిగా కోరారు. అనంతరం ఉత్సవాల ఏర్పాట్లు, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై మంత్రితో సుదీర్ఘంగా చర్చించారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ముక్కోటి ఏకాదశి వంటి ఆధ్యాత్మిక పర్వదినాలు ప్రజల్లో భక్తి భావాన్ని, ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. భద్రాద్రి రామయ్య ఆలయంలో నిర్వహించే ఈ వేడుకలను అత్యంత సంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా పురాతన ఆచారాలు, పూజా విధానాలు ఎక్కడా పక్కదారి పట్టకుండా భక్తుల మనోభావాలను గౌరవిస్తూ ఉత్సవాలు జరపాలని స్పష్టం చేశారు. ఆధ్యాత్మిక వైభవం వెల్లివిరిసేలా ఉత్సవ ఏర్పాట్లు ఉండాలని ఆయన సూచించారు. ఉత్సవాల సమయంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. దర్శన క్యూ లైన్లు, శాంతి భద్రతలు, తాగునీరు మరియు వైద్య సదుపాయాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున, అన్ని ప్రభుత్వ శాఖల సమన్వ యంతో పనులను వేగవంతం చేయాలని పిలుపు నిచ్చారు. దేవస్థాన అధికారులతో పాటు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## ఎడవల్లి రామీరెడ్డి పార్థివదేహానికి నివాళులు అర్పించిన ఉపేందర్ రెడ్డి

### ఒక మంచి మిత్రుడిని కోల్పోయాను..



**కూసుమంచి, మహా:** గత రెండు రోజుల క్రితం బైక్ యాక్సిడెంట్ తో మరణించిన పాలేరు కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎడవల్లి రామీరెడ్డి పార్థివ దేహాన్ని కుటుంబ సమేతంగా సందర్శించి, నివాళులు అర్పించారు, వారి కుటుంబాన్ని ఓదార్చి, ఆ భగవంతుడు ఎల్లవేళలా వారికి తోడు ఉండేలా కోరుకున్నారు.. పాలేరు మాజీ శాసనసభ్యులు గౌ "శ్రీ "కందాళ ఉపేందర్ రెడ్డి గారు కందాళ విజయమ్మ గారుఈ కార్యక్రమంలో కూసుమంచి మాజీ ప్రజాప్రతినిధులు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు

## రాంరెడ్డికి నివాళులర్పించిన పోతినేని సుదర్శన్



**కూసుమంచి, మహా:** సిపిఎం మాజీ మండల కార్యదర్శి, ఎస్ఎఫ్ఐ పాలేరు డివిజన్ మాజీ నాయకులు యడవల్లి రాంరెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. శనివారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు మండలంలోని పాలేరు గ్రామంలో మృతదేహాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు, పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్, మండల కార్యదర్శి తోటకూరి రాజశేఖర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై . విక్రమ్, మండల కమిటీ సభ్యులు యడవల్లి రమణారెడ్డి,శీలం గురుమూర్తి, బిక్కసాని గంగాధర్, నెల్లూరి వెంగళరావు, గోపి వెంకన్న, పందిరి వీరారెడ్డి,గన్యానాయక్, వెంకటయ్య, ఉపేందర్, తదితరులు పాల్గొని నివాళులర్పించారు

## పర్యాటక రంగం అభివృద్ధిలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు భాగస్వాములు కావాలి



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధి, వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు విస్తృతంగా చేరవేసే బాధ్యతను సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు స్వీకరించి యువతలో చైతన్యం కలిగించే విధంగా భాగస్వాములుగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ అన్నారు.శనివారం ఐడీఓసీ కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా పర్యాటక రంగ అభివృద్ధి, ముక్కోటి సందర్భంగా నిర్వహించనున్న ఫెస్టివల్ను విజయవంతం చేయడానికి చేపట్టవలసిన చర్యలపై ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రకృతి సౌందర్యం ఆధ్యాత్మికత గిరిజన సంస్కృతి సమ్మేళనంగా ఉన్న జిల్లాగా గుర్తింపు పొందిందని అన్నారు. జిల్లాలోని పగిడేరు వేడి నీళ్లు, గోదావరి నది పరివాహక ప్రాంతాలు, కనిగిరి గుట్టలు, కిన్నెరసాని అడవీ ప్రాంతాలు వంటి అనేక విశిష్టమైన పర్యాటక కేంద్రాలు ఉన్నాయని తెలిపారు.

# పాడే మోసి.. కంటతడి పెట్టి..

- కార్యకర్త పాడే మోసిన మంత్రి పొంగులేటి
- నాయకుడికి కన్నీటి వీడ్కోలు పలికిన నేతలు .!
- అంతిమ యాత్రకు కదిలిన జనం..





**కూసుమంచి, మహా:** రాజకీయం అంటే కేవలం పదవులు... అధికార దర్పం మాత్రమే కాదు.. అంతకు మించిన ఆత్మీయ అనుబంధమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిరూపించారు. పార్టీ పటిష్ఠత కోసం కృషి చేస్తూ... తన వెన్నంటి నడిచిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు యడవల్లి రామిరెడ్డి అకాల మరణం ఆయన్ని తీవ్రంగా కలచివేసింది. శనివారం కూసుమంచి మండలం పాలేరు గ్రామంలో జరిగిన రామిరెడ్డి అంత్యక్రియల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్న తీరు అక్కడున్న వేలాది మంది కళ్లను చెమర్చింది.

### అధికార హోదా మరచి..

అంత్యక్రియల సందర్భం గా మంత్రి పొంగులేటి తన ప్రోటోకాల్‌ను పక్కన పెట్టారు. తన ప్రియతమ అనుచరుడికి కడసారి వీడ్కోలు పలుకుతూ మంత్రి స్వయంగా పాడే మోశారు. సాధారణ కార్యకర్తలు, ఇతర నాయకులతో కలిసి శ్మశాన వాటిక వరకు నడిచి తనపై ఉన్న అపారమైన గౌరవాన్ని, అభిమానాన్ని చాటుకున్నారు. ఒక రాష్ట్ర మంత్రి హోదాలో ఉండి కూడా, తన అనుచరుడి కోసం పాడే పట్టి.. కన్నీటి వీడ్కోలు పలకడాన్ని చూసి పాలేరు ప్రజలు భావోద్వేగానికి లోనయ్యారు.

### పాలేరు శోకసంద్రం...

**సీనియర్ నాయకుడు రామిరెడ్డి మృతితో పాలేరు గ్రామం మౌన రోదనతో నిండిపోయింది. వేలాదిగా తరలివచ్చిన జనవాహిని మధ్య అంత్యక్రియలు ముగి శాయి. "పార్టీ ఒక నిబద్ధత గల సీనియర్ నాయకుడిని కోల్పోయింది. నా రాజకీయ ప్రయాణంలో రామిరెడ్డి పాత్ర మరువలేనిది" అని మంత్రి ఆవేదన వ్యక్తం చేస్తూ ఆయన కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.**

### జనసందోహం నడుము అంత్యక్రియలు..

**కూసుమంచి మండలం, పాలేరు గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు యడవల్లి రాంరెడ్డి గత రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా శనివారం అంత్యక్రియలు కన్నీటి వీడ్కోలు నడుమ జరిగాయి. ఈ అంతిమయాత్ర కు పాలేరు గ్రామం మొత్తం తరలివచ్చారు. అలాగే గిడ్డం గులు శాఖ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. జిల్లా, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు అంతిమ యాత్రలో పాల్గొన్నారు.**

## బుకింగ్ యాప్‌పై రైతులకు అవగాహన తప్పని

**సరినేలకొండపల్లి, మహా:** రైతులకు బుకింగ్ యాప్‌పై అవగాహన కలిగి ఉండాలని నేలకొండపల్లి మండల వ్యవసాయాధికారి యం. రాధ సూచించారు. మండలం లోని చెరువుమాధారంలో శనివారం రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. బుకింగ్ యాప్ ఎలా చేసుకోవాలో రైతులకు వివరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు... సాగు చేసిన పంటలకు సరిపడా యూరియా సకాలంలో అందించే లక్ష్యంతో ప్రభుత్వం



యాప్ ను ప్రవేశపెట్టిందని అన్నారు. యూరియా బుకింగ్ యాప్ ను రాష్ట్ర వ్యాప్తంగా అమలు లోకి తెస్తుందని ఆమె తెలిపారు. రైతులు యాప్ ద్వారా యూరియా ను బుక్ చేసుకోవాలని సూచించారు. రైతులకు యూరియా బుకింగ్ చేసిన వెంటనే బుకింగ్ ఐడీ నెంబర్ అందుతుందని అన్నారు. ఐడీ నెంబర్ తో పాటు పాసు పుస్తకం, ఆధార్ కార్డు తీసుకుని మరుసటి రోజు లోపు డీలర్ వద్ద యూరియా కొనుగోలు చేయవచ్చునని అన్నారు. రైతులు ఈ అవకాశం ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## వక్ఫ్ బోర్డ్ భూములను కాపాడండి

- స్థలాలను స్వాధీనం చేసుకొని పరిశ్రమలు నెలకొలపాలి
- నిరుద్యోగ ముస్లింలకు ఉపాధి కల్పించాలి
- అర్హులకు రుణాలు ఇచ్చి ఆదుకోవాలి
- అధికారులకు ముస్లిం సోదరుల విజ్ఞప్తి



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో ఉన్న వక్ఫ్ బోర్డు భూములకు రక్షణ లేకుండా పోయిందని అట్టి భూములకు రక్షణ కల్పిస్తూ అధికారులు చర్యలు చేపట్టాలని బీ.సి.సి జామా మజీద్ అధ్యక్షులు మస్తాన్, ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు మహమ్మద్ రియాజ్ లు సంబంధిత శాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు శనివారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. వక్ఫ్ బోర్డ్ భూముల ఆక్రమణపై గతంలో అధికారులకు ఇటీవల మంత్రి అజారుద్దీన్ దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. ఫిర్యాదు మేరకు మూడు రోజుల కిందట ప్రభుత్వ శాఖ అధికారులు జిల్లా కేంద్రంలోని కొన్ని ప్రాంతాలలో కబ్జాకు గురికాబడిన వక్ఫ్ బోర్డ్ భూముల వివరాలను సేకరించడం జరిగిందన్నారు. ఆక్రమణకు గురైన భూములను తిరిగి స్వాధీనం చేసుకొని ఆ స్థలాలలో నూతన పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ ముస్లిం యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. ముస్లింలలో నిరుద్యోగులు ఎక్కువగా ఉన్నారని వారికి ఉద్యోగాలు రావాలంటే వక్ఫ్ బోర్డ్ కాళీ భూములలో నూతన పరిశ్రమ లు స్థాపించాల్సిన అవసరం ఉందన్నారు.

## విపత్తుల నిర్వహణకు ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్

### జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్

**కొత్తగూడెం, మహా:** ప్రకృతి వైపరీత్యాలు ఇతర విపత్తుల సమయంలో సమర్థవంతమైన స్పందనతో ప్రాణ ఆస్తి నష్టాన్ని తగ్గించేందుకు ముందస్తు అప్రమత్తత అత్యంత అవసరమని జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ అన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఈ నెల 22వ తేదీన విపత్తుల నిర్వహణపై మాక్ డ్రిల్ నిర్వహించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.శనివారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందనలతో కలిసి విపత్తుల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ ను జిల్లాలో పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. విపత్తుల సమయంలో వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లాలో ఈఓసి కీలక పాత్ర పోషిస్తుందని ఇందులో జిల్లా స్థాయి అధికారులు, రెవెన్యూ, ఇరిగేషన్, వైద్య, ఫైర్, పోలీస్, ఎస్డిఆర్ఎఫ్, ఎన్డిఆర్ఎఫ్ తదితర విభాగాలు సభ్యులుగా ఉండాలని తెలిపారు. ఈఓసి ద్వారా విపత్కర పరిస్థితుల్లో చేపట్టవలసిన జాగ్రత్తలు ముందస్తు చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన సామాగ్రి వనరులు పటిష్టమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు.



# ఖమ్మం రైతులకు నానో ఊరట

* సాగులో రూ. 300 కోట్ల అదనపు లాభం!
* డ్రోన్ టెక్నాలజీతో యూరియా కష్టాలకు చెక్!
* ఒక బాటిల్.. ఒక బస్తా.. సరికొత్త విప్లవం!
* ప్రభుత్వ ఖజానాకు వెయ్యి కోట్ల పొదుపు..
* నానో యూరియాతో సాగు భారం మాయం!
* ఇక క్యూలైన్లు ఉండవు.. లారీఛార్జీలు లేవు.
* మీ అరచేతిలో 'యూరియా' బుకింగ్!



**ఖమ్మం బ్యూరో, మహా:** సాగు సీజన్ వచ్చిందంటే రైతులకు ఎరువుల బస్తాల మోత, ఖర్చుల భారమే గుర్తుకు వచ్చేవి. కానీ, నేడు సాంకేతికత పుణ్యమా అని ఆ పరిస్థితులు వేగంగా మారుతున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సుమారు 11 లక్షల ఎకరాల్లో సాగవుతున్న పంటలకు నానో యూరియా రూపంలో ఒక గొప్ప వరం లభించింది. బస్తాల కొద్దీ యూరియాను మోయాల్సిన అవసరం లేకుండా, రవాణా ఖర్చులు భరించాల్సిన పని లేకుండా ఒక చిన్న బాటిల్‌తోనే ఎకరం పొలానికి పోషకాలను అందించే వీలు కలిగింది. దీనివల్ల రైతులకు వందల కోట్ల లాభం చేకూరడమే కాకుండా, ఎరువుల సబ్సిడీ రూపంలో ప్రభుత్వంపై పడుతున్న వేల కోట్ల భారం కూడా తగ్గనుంది*ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల వ్యాప్తంగా వరి, మిర్చి, పత్తి, మొక్కజొన్న వంటి పంటల సాగు అత్యధికంగా ఉంటుంది. అధికారిక గణాంకాల ప్రకారం, ఈ ఉమ్మడి జిల్లాలో ఏటా వానాకాలం మరియు యాసంగి సీజన్లలో కలిపి సుమారు 1.5 లక్షల నుండి 1.8 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమవుతోంది. అంటే సుమారు 40 లక్షల యూరియా బస్తాలను రైతులు వినియోగిస్తున్నారు. ఒక్కో యూరియా బస్తాను దుకాణం నుండి పొలానికి తరలించేందుకు రైతుకు రవాణా ఖర్చుల రూపంలోనే బస్తాకు 30 నుండి 50 రూపాయల వరకు అదనపు భారం పడుతోంది. కేవలం రవాణా కోసమే ఉమ్మడి జిల్లా రైతులు ఏటా సుమారు 12 నుండి 15 కోట్ల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది. అయితే నానో యూరియా వినియోగం వల్ల ఈ రవాణా భారం దాదాపు సున్నా అవుతోంది. రైతు తన ద్విచక్ర వాహనంపై లేదా చేతి సంచిలో ఈ బాటిళ్లను సులభంగా తరలించవచ్చు.ఆర్థిక కోణంలో చూస్తే, ప్రస్తుతం 45 కిలోల యూరియా బస్తా ధర మార్కెట్లో 266 రూపాయల వరకు ఉండగా, ప్రభుత్వం దానిపై ఇస్తున్న సబ్సిడీ అనూహ్యం. ఒక్కో బస్తా అసలు ధర (ఉత్పత్తి వ్యయం) దాదాపు 2,200 నుండి 3,000 రూపాయల వరకు ఉంటుంది. అంటే ఒక్కో బస్తాపై కేంద్ర ప్రభుత్వం సుమారు 2,000 నుండి 2,500 రూపాయల సబ్సిడీని భరిస్తోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లా అవసరాల దృష్ట్యా చూస్తే, కేవలం ఈ రెండు జిల్లాల కోసమే ప్రభుత్వం ఏటా సుమారు 1,000 కోట్ల రూపాయల సబ్సిడీ భారాన్ని మోస్తోంది. రైతులకు నానో యూరియాపై అవగాహన పెరిగి, వారు సంప్రదాయ యూరియా వాడకం తగ్గిస్తే, ప్రభుత్వానికి ఈ వెయ్యి కోట్ల నిధులు ఆదా అవుతాయి, ఆ నిధులను ఇతర సాగు ప్రయోజనాలకు కేటాయించే అవకాశం ఉంటుంది. రైతులకు కూడా నానో యూరియా బాటిల్ 225 నుండి 240 రూపాయలకే లభించడం వల్ల బస్తా కొనుగోలుపై కూడా కొంత మొత్తం ఆదా అవుతోంది.

# జర్నలిస్ట్‌లకు పొంగులేటి తీపికబురు



## పది రోజుల్లో అక్రిడిటేషన్ కార్డుల జీవో

* జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం
* వచ్చే ఏడాది ఇళ్ల స్థలాల కేటాయింపుపై తీపి కబురు
* టీడబ్ల్యూజేఎఫ్ మహాసభలో మంత్రి పొంగులేటి

**ఖమ్మం, మహా:** జర్నలిస్టుల చిరకాల వాంఛలైన అక్రిడిటేషన్ కార్డులు, ఇళ్ల స్థలాల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎస్ ఆర్ కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) జిల్లా మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరుకావాల్సి ఉంది. అయితే అనివార్య కారణాల వల్ల అత్యవసరంగా హైదరాబాద్ వెళ్లాల్సి రావడంతో మంత్రి ఫోన్ ద్వారా జర్నలిస్టులను ఉద్దేశించి ప్రసంగించారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకోబోయే కీలక నిర్ణయాలను ఈ సందర్భంగా వివరించారు. త్వరలో అక్రిడిటేషన్ కార్డులు రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదురుచూస్తున్న అక్రిడిటేషన్ కార్డుల ప్రక్రియ తుది దశకు చేరుకుందని మంత్రి పొంగులేటి తెలిపారు. రాబోయే పది రోజుల్లోనే దీనికి సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు (జీవో) విడుదల చేస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ కార్డులు అందేలా చర్యలు తీసుకుంటామని ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు.ఇళ్ల స్థలాలపై స్పష్టతజర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఇప్పటికే లోతుగా చర్చించామని మంత్రి పేర్కొన్నారు. గతంలో సుప్రీంకోర్టు ఉత్తర్వులు, న్యాయపరమైన చిక్కుల వల్ల కొంత ఆలస్యమైందని అయితే వాటన్నింటినీ అధిగమించి వచ్చే ఏడాది జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల విషయంలో ప్రభుత్వం తరపున తీపి కబురు అందిస్తామని ప్రకటించారు. జర్నలిస్టుల ఆత్మగౌరవాన్ని కాపాడటం తమ ప్రభుత్వ బాధ్యతని ఆయన ఉద్ఘాటించారు.సమిష్టిగా ముందుకు సాగాలిటీడబ్ల్యూజేఎఫ్ జిల్లా మహాసభలు ఘనంగా నిర్వహించుకోవడం పట్ల మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. జర్నలిస్టుల హక్కుల కోసం పోరాడుతున్న సంఘం నాయకులను, సభ్యులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర, జిల్లా స్థాయి ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

## మణుగూరు అభివృద్ధిపై మున్సిపల్ అధికారులతో ఎమ్మెల్యే పాయం సమీక్ష



**మణుగూరు, మహా:** మణుగూరు మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, ప్రజలకు అందుతున్న మౌలిక వసతుల స్థితిగతులపై పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు మున్సిపాలిటీ అధికారులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పారిశుధ్యం, తాగునీటి సరఫరా, రహదారులు, వీధిదీపాల నిర్వహణ తదితర అంశాలపై ఎమ్మెల్యే విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను తక్షణమే గుర్తించి వేగంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, నిర్ణీత గడువుల్లో పనులు పూర్తి చేయాలని స్పష్టంగా సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమర్థవంతమైన, బాధ్యతాయుత పాలన అందించడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.సమావేశంలో సీసీ రోడ్లు, సైడ్ డ్రెయిన్ కాలువల నిర్మాణ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, నాణ్యతలో లోపాలు లేకుండా పనులు పూర్తిచేయాలని సూచించారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుపై ప్రత్యేకంగా చర్చించి, అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు వేగంగా మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని, మొత్తం ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాదబాబు, హౌసింగ్ ఏఇ పాల్గొన్నారు.

## సింగరేణి మనుగడపై కుట్రలు సహించం

**మణుగూరు, మహా :** 136 ఏళ్ల చరిత్ర కలిగిన ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణి కోల్ మైన్స్ మనుగడపై రాష్ట్ర ప్రభుత్వం కుట్రలకు తెరలేపుతోందని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (బీఎంఎస్) అనుబంధ ఏబీకేఎంఎస్ కార్యదర్శి పి మాధవ నాయక్ ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ బాటలోనే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా సింగరేణిని నిర్వీర్యం చేసే నిర్ణయాలకు శ్రీకారం చుట్టిందన్నారు.శనివారం స్థానిక బీఎంఎస్ కార్యాలయంలో ఏరియా ఉపాధ్యక్షుడు బి కిషన్ అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మణుగూరు పీకే ఓసి-2 డీప్ సైడ్ (ఎక్స్ టెన్షన్) బొగ్గు బ్లాక్‌ను సింగరేణిని పక్కన పెట్టి జెన్కో పేరుతో ప్రైవేటు సంస్థలకు అప్పగించాలనే ప్రయత్నం సింగరేణి మనుగడపైనే జరుగుతున్న ప్రత్యక్ష దాడిగా ఆయన ఆరోపించారు. ఈ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో తాడిచెర్ల బొగ్గు బ్లాక్‌ను జెన్కో పేరుతో ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పగించడం వల్ల సింగరేణికి వేల కోట్ల రూపాయల ఆర్థిక నష్టం వాటిల్లిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అదే విధానాన్ని ఇప్పుడు మణుగూరు పీకే ఓసి-2 డీప్ సైడ్ ఎక్స్ టెన్షన్ బొగ్గు బ్లాక్‌పై అమలు చేయడం కార్మికుల ఉపాధి, సంస్థ భవిష్యత్తు, రాష్ట్ర ప్రజల ఆస్తిని తాకట్టు పెట్టడమేనని విమర్శించారు.మూడు నెలల క్రితం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో సింగరేణి వేలంపాటల్లో పాల్గొనకపోతే సంస్థ మనుగడకే ప్రమాదమని హెచ్చరించిన విషయాన్ని ప్రస్తావించారు.



మహా పత్రిక
ANN తెలుగు

# రాజ్యాంగాన్ని కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది

## జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్



భద్రాద్రి బ్యూరో, మహా: భారత రాజ్యాంగాన్ని కాపాడవలసిన బాధ్యత కేవలం న్యాయస్థానాలకు, న్యాయవాదులకు మాత్రమే కాకుండా ప్రతీ ఒక్క పౌరునిపై ఉందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ స్పష్టం చేశారు. సమసమాజ స్థాపన సమానత్వం సామాజిక న్యాయం అనే లక్ష్యాలతో రూపుదిద్దుకున్న భారత రాజ్యాంగ విలువలను కాపాడుకోవడంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం కొత్తగూడెం క్లబ్‌లో ఐ.ఎల్.పీ.ఏ జాతీయ అధ్యక్షురాలు కె.సుజాత చౌదంతి అధ్యక్షతన నిర్వహించిన ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఐ.ఎల్.పీ.ఏ)తెలంగాణ రాష్ట్ర ఐదవ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం కేవలం చట్టాల సమాహారం మాత్రమే కాకుండా దేశ ప్రజల జీవన విధానాన్ని దిశానిర్దేశం చేసే మహత్తర గ్రంథమని అన్నారు. సమాన హక్కులు మానవగౌరవం స్వేచ్ఛ సోదరభావం వంటి విలువలను ప్రజలందరికీ అందించాలనే సంకల్పంతో రాజ్యాంగం రచించబడిందని వివరించారు. రాజ్యాంగంలో పొందుపరిచిన మౌలిక హక్కులు దిశానిర్దేశక సూత్రాలు సమాజంలోని అట్టడుగు వర్గాల అభ్యున్నతికి పునాదులుగా నిలుస్తున్నాయని వాటిని కాపాడే బాధ్యత న్యాయవ్యవస్థతో పాటు సమాజంలోని ప్రతీ ఒక్కరిపై ఉందని ఆయన అన్నారు. ముఖ్యంగా న్యాయవాదులు రాజ్యాంగ స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. నేటి కాలంలో రాజ్యాంగ విలువల పట్ల అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఎంతో ఉందని, ఈ దిశగా ఇటువంటి రాష్ట్ర స్థాయి మహాసభలు న్యాయవాదుల మధ్య చర్చకు, ఆలోచనలకు, మార్గదర్శకత్వానికి దోహదపడతాయని జిల్లా జడ్జి తెలిపారు. న్యాయవృత్తిలో నైతిక విలువలు సామాజిక బాధ్యతలను పెంపొందించేందుకు ఈ తరహా సదస్సులు ఉపయోగపడతాయని అన్నారు. ప్రత్యేకంగా గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు రాజ్యాంగం న్యాయస్థానాల విధులు చట్టాల పట్ల అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, భవిష్యత్తులో న్యాయవాదులు గ్రామస్థాయిలో కూడా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరముందని సూచించారు. అలా చేసినప్పుడే నిజమైన న్యాయసమాజం ఆవిర్భవిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమానికి వేదికగా నిలిచిన ఐ.ఎల్.పీ.ఏ తెలంగాణ యూనిట్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందిస్తూ న్యాయవాదుల హక్కులు, సమస్యలు, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో కూడా ఐ.ఎల్.పీ.ఏ మరిన్ని సామాజిక చైతన్య కార్యక్రమాలు చేపట్టి న్యాయవ్యవస్థపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత బలపరచాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి సరిత, న్యాయమూర్తులు కిరణ్ కుమార్, కవిత, రాజేందర్, సుచరిత, రవికుమార్, వినయ్ కుమార్, సూరెడ్డి, లక్కినేని సత్యనారాయణ, ఐ.ఎల్.పీ.ఏ తెలంగాణ బాధ్యులు శాంసన్, దేవరాజ్ గౌడ్, లక్ష్మీదేవి, సైనీ నాగేందర్, అదనం కామర్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ అధికారులతో ఎమ్మెల్యే పాయం సమీక్ష



మణుగూరు, మహా: మణుగూరు మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, ప్రజలకు అందుతున్న మౌలిక వసతుల స్థితిగతులపై పినపాక శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు మున్సిపాలిటీ అధికారులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, రహదారులు, వీధిదీపాల నిర్వహణ తదితర అంశాలపై ఎమ్మెల్యే విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను తక్షణమే గుర్తించి వేగంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, నిర్ణీత గడువుల్లో పనులు పూర్తి చేయాలని స్పష్టంగా సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమర్థవంతమైన, బాధ్యతాయుత పాలన అందించడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.సమావేశంలో సీసీ రోడ్లు, సైడ్ డ్రెయిన్ కాలువల నిర్మాణ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, నాణ్యతలో లోపాలు లేకుండా పనులు పూర్తిచేయాలని సూచించారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుపై ప్రత్యేకంగా చర్చించి, అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు వేగంగా మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని, మొత్తం ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాదబాబు, హౌసింగ్ ఏఇ, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## సింగరేణి మనుగడపై కుట్రలు సహించం



మణుగూరు, మహా: 136 ఏళ్ల చరిత్ర కలిగిన ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణి కోల్ మైన్స్ మనుగడపై రాష్ట్ర ప్రభుత్వం కుట్రలకు తెరలేపుతోందని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (బీఎంఎస్) అనుబంధ ఏబీకేఎంఎస్ కార్యదర్శి పి మాధవ నాయక్ ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ బాటలోనే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా సింగరేణిని నిర్వీర్యం చేసే నిర్ణయాలకు శ్రీకారం చుట్టిందన్నారు. శనివారం స్థానిక బీఎంఎస్ కార్యాలయంలో ఏరియా ఉపాధ్యక్షుడు బి కిషన్ అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మణుగూరు పీకే ఓసీ-2 డీప్ సైడ్ (ఎక్స్‌టెన్షన్) బొగ్గు బ్లాక్‌ను సింగరేణిని పక్కన పెట్టి జెన్కో పేరుతో ప్రైవేటు సంస్థలకు అప్పగించాలనే ప్రయత్నం సింగరేణి మనుగడపైనే జరుగుతున్న ప్రత్యక్ష దాడిగా ఆయన ఆరోపించారు. ఈ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో తాడిచెర్ల బొగ్గు బ్లాక్‌ను జెన్కో పేరుతో ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పగించడం వల్ల సింగరేణికి వేల కోట్ల రూపాయల ఆర్థిక నష్టం వాటిల్లిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అదే విధానాన్ని ఇప్పుడు మణుగూరు పీకే ఓసీ-2 డీప్ సైడ్ ఎక్స్ టెన్షన్ బొగ్గు బ్లాక్‌పై అమలు చేయడం కార్మికుల ఉపాధి, సంస్థ భవిష్యత్తు, రాష్ట్ర ప్రజల ఆస్తిని తాకట్టు పెట్టడమేనని విమర్శించారు.

## తల్లాడ టీడీపి వార్డు మెంబర్లుకి సన్మానం

తల్లాడ, (మహా): తల్లాడ మేజర్ గ్రామపంచాయతీ ఇటీవల జరిగిన ఎన్నికలలో బి ఆర్ యస్ పార్టీ బలపరిచిన టీడీపీ 5 వార్డులు పోటి చెస్తే 4 వార్డు లు గెలవటం జరిగాయి. ఐతే 1 వ వార్డు స్వల్ప తేడా 7 ఓట్ల తో ఓడిపోవడం జరిగింది. శనివారం ఖమ్మం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం రాష్ట్ర పార్టీ అధ్యక్షులు బక్కిన్ని నరసింహులు వారి చేతుల మీదుగా తల్లాడ తెలుగుదేశం పార్టీ గెలుపొందిన వార్డులు 2 వ వార్డు పెరిక.శ్రీలేఖ,3 వ వార్డు సరికొండ.శ్రీనివాస రాజు.,5 వ వార్డు గుంటుపల్లి. కుమారి,13 వ వార్డు ముకర. దోనేష్, లను ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా టీడీపి నాయకులు వాసిరెడ్డి రామనాధం, కేతినేని హరీష్, టీడీపి మండల నాయకులు ధూపాటి భద్రరాజు, సరికొండ. శ్రీనివాస రాజు, కొమ్మినేని రామయ్య,సత్యనారాయణ, మొక్క. క్రిష్ణర్జున్, పెరిక.కిట్టు తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధి హామీ పేరు మార్పిడి నిర్ణయం వెనక్కు తీసుకోవాలి



భద్రాద్రి కొత్తగూడెం, మహా: జాతీయ ఉపాధి హామి పథకం పేరు మార్పిడి నిర్ణయంను వెనక్కుతీసు కోవాలని గాంధీపథం రాష్ట్ర కన్వీనర్ బూసిరెడ్డి శంకర్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ ఉపాధి హామి పథకం పేరు మార్చాలని ఎన్డీఏ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం దుర్మార్గమైన చర్య అని అభివర్ణించారు. బీజేపై ప్రజలు తిరగబడే రోజులు దగ్గర పడుతున్నాయని తెలిపారు. నెహ్రూ, గాంధీ పేర్లను సమూలంగా తొలగించేందుకు ఎన్డీఏ ప్రభుత్వం కంకణం కట్టుకుందన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం పేరు మార్పిడిని నిరసిస్తూ, ప్రజలను చైతన్యవంతం చేసేందుకు గానూ గాంధీపథం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టి, ఎన్డీఏను గద్దె దింపే వరకు ఉద్యమిస్తామన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 50 వేలకు పైగా ఉన్న గాంధీపథం క్యాడర్తో మొదట ఖమ్మం, భద్రాద్రి జిల్లాలలో నిరసన కార్యక్రమాలు మొదలుపెట్టి అన్నీ జిల్లాలో నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో గాంధీపదం జిల్లా కన్వీనర్ చింతలచెర్వు గిరిశం, సభ్యులు జ్ఞానవినోదిని, కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.

## శివ రామకృష్ణను పదవి నుండి తొలగించిన చెన్నం




బూర్గంపహాడ్ మహా: బూర్గంపాడు "ప్రెస్ క్లబ్ మీడియా సొసైటి" ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా క్లబ్ సభ్యులతో తీర్మానం చేసి ప్రెస్ క్లబ్ సెక్రెటరీ గా ఉన్న ఎడారి శివరామకృష్ణ ని గత కొద్ది రోజుల క్రితమే తొలగించడం జరిగింది. ఈ సందర్భంగా, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చెన్నం హనుమంతరావు మాట్లాడుతూ, ప్రెస్ క్లబ్ యొక్క నియమ నిబంధనలను ఉల్లంఘించినందుకు పని పట్ల అశ్రద్ధ, నిర్లక్ష్య ధోరణి వల్ల ప్రెస్ క్లబ్ సభ్యుల తీర్మానం తో అతని తక్షణమే తొలగించడం జరిగిందని,అంతేకాకుండా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నైన తనపై సోషల్ మీడియాలో అసత్య ప్రసారాలు చేశాడని క్లబ్ కి సంబంధం లేని వ్యక్తులు తీసుకువచ్చి తనే స్వయంగా ప్రెసిడెంట్ అని ప్రకటించుకున్నాడుగా తెలిపారు ఆ వ్యక్తికి బూర్గంపాడు ప్రెస్ క్లబ్ మీడియా సొసైటీ కి ఎలాంటి సంబంధం లేదు.కావున మండల ప్రజలు, రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారులు గమనించగలరని ఒక ప్రకటన లోతెలియచేసారు

## ఎన్ ఎస్ యుఐ అధ్యక్షులు వెంకటస్వామిని కలిసిన అడపా చౌదరి



తల్లాడ, డిసెంబర్ 20,( మహా ): ఎన్ఎస్ యుఐ రాష్ట్ర అధ్యక్షులు వెంకటస్వామిని ఖమ్మం జిల్లా యువజన, కాంగ్రెస్ అధ్యక్షులు అడపా అనిల్ చౌదరి శనివారం హైదరాబాదులో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కాలేజ్, స్కూల్ ఫీజ్ రియంబర్స్‌మెంట్ సమస్యల పరిష్కారం ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల ఫలితాలపై సమీక్ష అలాగే త్వరలో జరగనున్న జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి తీసుకోవాల్సిన వ్యూహాలు ప్రణాళికలపై సుదీర్ఘంగా చర్చించారు. ఫీజ్ రియంబర్స్‌మెంట్ విషయంలో విద్యార్థులు తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించాల్సిన అవసరం ఉందని అనిల్ చౌదరి వివరించారు.

## రోడ్డు ప్రమాద బాధితుడికి చేయూత



**అశ్వాపురం/మణుగూరు, మహా :** అశ్వాపురం మండల కేంద్రానికి చెందిన దోసపాటి రంగారావు చారిటబుల్ ట్రస్ట్ అధినేత దోసపాటి పిచ్చేశ్వరరావు మరోసారి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. రోడ్డు ప్రమాదానికి గురై వైద్య చికిత్సల ఖర్చులకు ఇబ్బందులు పడుతున్న బాధితుడికి శనివారం ఆర్థిక సాయం అందజేశారు.మండలంలోని మిట్టగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని గోపాలపురం గ్రామానికి చెందిన సత్యనారాయణ రెడ్డి ఇటీవల జరిగిన వాహన ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న దోసపాటి పిచ్చేశ్వరరావు బాధితుడి స్వగృహానికి వెళ్లి అతని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం చేయించుకోవాలని సూచిస్తూ ఆర్థిక సాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే ట్రస్ట్ లక్ష్యమని తెలిపారు. ట్రస్ట్ స్థాపించిన నాటి నుంచి ఎవరికైనా ఇబ్బందులు ఎదురైతే ముందుకు వచ్చి సహాయం అందించడమే తమ బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు.దోసపాటి పిచ్చేశ్వరరావు చేస్తున్న సేవలను స్థానికులు ప్రశంసిస్తున్నారు. బాధితులు చెప్పకపోయినా ఎక్కడ ఏ ప్రమాదం జరిగినా ఆయనే స్వయంగా వివరాలు తెలుసుకుని, అవసరమైన మేరకు సహాయ సహకారాలు అందించడం వల్ల దోసపాటి రంగారావు చారిటబుల్ ట్రస్ట్‌కు విశేషమైన పేరు ప్రతిష్ఠలు వచ్చాయని పలువురు తెలిపారు. కార్యక్రమంలో గడుపుడి పద్మ, నర్రా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకంలో గాంధీ పేరు తొలగించడం దేశద్రోహమే

**ఖమ్మం, మహా:** ఉపాధి హామీ పథకం నుండి మహాత్మా గాంధీ పేరును తొలగించడాన్ని ఆయన దేశద్రోహమే అని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభివర్ణించారు. ఖమ్మం నగర కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా నాగండ్ల దీపక్ చౌదరి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఖమ్మంలోని మంత్రి తుమ్మల క్యాంప్ కార్యాలయంలో అత్యంత వైభవంగా జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల సమక్షంలో దీపక్ చౌదరి పదవీ బాధ్యతలు చేపట్టగా, పార్టీ శ్రేణులు ఆయనకు ఘనంగా శుభాకాంక్షలు తెలియజేశాయి.అనంతరం జరిగిన సభలో మంత్రి తుమ్మల ప్రసంగిస్తూ భారతీయ జనతా పార్టీ తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తుపాకీ తూటాలకు బలై, చివరి క్షణంలో 'హే రామ్' అంటూ దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు గాంధీజీ అని, అలాంటి వ్యక్తి పేరును పథకం నుండి తొలగించడం దారుణమని మండిపడ్డారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఒక్క గ్రామ పంచాయతీలో కూడా బీజేపీని గెలిపించకుండా ఆ పార్టీకి బుద్ధి చెప్పిన జిల్లా ప్రజలకు ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## పాత పద్ధతిలోనే సింగరేణి డే వేడుకలు నిర్వహించాలి




**మణుగూరు, మహా:** సింగరేణి యాజమాన్యం ప్రతి సంవత్సరం నిర్వహించే సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పాత పద్ధతిలోనే, కార్మికులు, అధికారులు, కార్మికుల కుటుంబాల సమక్షంలో ఘనంగా నిర్వహించాలని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై రాంగోపాల్ డిమాండ్ చేశారు. ఈ విషయంలో యాజమాన్యం వెనక్కి తగ్గకపోతే వేడుకలను బహిష్కరిస్తామని హెచ్చరించారు. గత అనేక సంవత్సరాలుగా సింగరేణి డే వేడుకలు యావత్ సింగరేణి కార్మికులు, అధికారులు, వారి కుటుంబాలు కలిసి ఒక పండుగ వాతావరణంలో నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. అయితే ఈ ఏడాది కేవలం పరిమిత స్థాయిలో వేడుకలు నిర్వహించేందుకు మాత్రమే నిధులు విడుదల చేస్తూ యాజమాన్యం సర్క్యులర్ జారీ చేయడం కార్మికులను అవమానించే చర్యగా అభివర్ణించారు. గుర్తింపు కార్మిక సంఘంగా ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. నిత్యం బొగ్గు దుమ్ము ధూళిలో శ్రమిస్తూ రక్తాన్ని చెమటగా మార్చి సింగరేణి సంస్థకు వేల కోట్ల రూపాయల లాభాలు ఆర్జించి పెడుతున్న కార్మికుల మనోభావాలను దెబ్బతీసేలా యాజమాన్యం వ్యవహరిస్తోందని విమర్శించారు.

## అభివృద్ధిపై అధికారులతో సమీక్ష




**బూర్గంపహాడ్, మహాపినపాక:** నియోజకవర్గ అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలపై సారపాక ఐటిసిపిఎస్ గెస్ట్ హౌస్ లో శనివారం పినపాక నియోజకవర్గం శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని రోడ్లు, బ్రిడ్జీలు, అంగన్వాడీ భవనాల నిర్మాణానికి సంబంధించి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు .ఈ సమావేశంలో పీఆర్ ఈఈ సత్యనారాయణ, ఏఈ చారీ,ఐటీడీఏ ఈఈ మదుకర్, ఏఈ ప్రసాద్ లు పాల్గొన్నారు.

# ప్లాన్ ఏంటి? సీన్ ఏంటి?

- అటవీశాఖ వ్యవహారంపై అశ్వారావుపేటలో చర్చ
- తనిఖీల్లో ఏమీ లభించకపోయినా వాహనం ఎందుకు నిర్బంధం?
- పాల్వంచకు అంటూనే భద్రాచలం వైపు ఎందుకు తరలింపు?
- సామాన్య వాహన యజమాని జీవనంపై పడిన తీవ్ర ప్రభావం






**అశ్వారావుపేట, డిసెంబర్ 20, మహా:** చట్టాన్ని అమలు చేయాల్సిన శాఖలు తీసుకునే చర్యలు న్యాయంగా మాత్రమే కాకుండా, మానవీయంగా కూడా ఉండాలి. ఎందుకంటే ప్రతి ఫైలు వెనుక ఒక కుటుంబం, ప్రతి వాహనం వెనుక ఒక జీవితం ఉంటుంది. అశ్వారావుపేట మండలంలో అటవీశాఖ అధికారులు చేపట్టిన వాహన నిర్బంధ ఘటన ఇప్పుడు కేవలం అధికార చర్యగా కాకుండా, ఒక సామాన్యుడి జీవన పోరాటంగా మారింది. అడవి కలప స్మగ్లింగ్ అనుమానంతో వేరుశనగ లోడుతో వెళ్తున్న వాహనాన్ని అశ్వారావుపేట అటవీ రేంజర్ కార్యాలయానికి తీసుకువచ్చిన చర్య వరకు ఎవరూ ప్రశ్నించలేదు. అనుమానం ఉంటే తనిఖీ చేయడం చట్టబద్ధమే. కానీ తనిఖీల్లో ఎటువంటి అక్రమ కలప గానీ, అనుమానాస్పద వస్తువులు గానీ లభించకపోయినా, ఆ వాహనాన్ని విడుదల చేయకుండా నిర్బంధంలో ఉంచడం సహజంగానే అనేక సందేహాలకు దారితీస్తోంది.ఇక్కడితో వ్యవహారం ముగిసి ఉంటే ఇది సాధారణ ఘటనగానే మిగిలిపోయేది. కానీ మరుసటి రోజు ఖాళీ వాహనాన్ని అటవీ కార్యాలయం నుంచి భద్రాచలం రోడ్ వైపు తరలిస్తుండగా సమాచారం అందుకున్న వాహన యజమాని, లారీ యూనియన్ సభ్యులు అడ్డుకొని ప్రశ్నించగా, పాల్వంచకు తీసుకెళ్తున్నాం అని సమాధానం చెప్పారు. అయితే పాల్వంచ మార్గం కాకుండా భద్రాచలం రోడ్ వైపు తరలించడం అనుమానాలను మరింత బలపరిచింది. వివాదాలు తలెత్తగానే మళ్లీ అదే వాహనాన్ని అశ్వారావుపేట అటవీ కార్యాలయానికే తీసుకురావడం ప్రశ్నల వర్షానికి కారణమైంది. అటవీ సంపద రక్షణ అత్యవసరం. కానీ ఆ బాధ్యత పేరుతో తీసుకునే చర్యలు చట్టబద్ధంగానే కాకుండా, మానవీయంగా కూడా ఉండాలి. అశ్వారావుపేట ఘటనపై అటవీశాఖ నుంచి వెంటనే స్పష్టమైన, అధికారిక వివరణ రావాల్సిన అవసరం ఉంది. పై అధికారులు ఈ వ్యవహారంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి. వాస్తవాలు ప్రజల ముందుంచాలి. తప్పు లేని సామాన్యుడి జీవనంపై పడిన ప్రభావాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

### సామాన్యుడి జీవనాధారం ఆ వాహనం

ఈ ఘటనలో ఎక్కువగా నష్టపోయింది ఎవరు అనే ప్రశ్నకు సమాధానం స్పష్టం. ఆ వాహన యజమాని ఒక సామాన్యుడు. ఫైనాన్స్‌లో వాహనం తీసుకుని, నెలనెలా కష్టపడి వచ్చిన డబ్బులు జమ చేస్తూ, కుటుంబాన్ని పోషించుకుంటున్న వ్యక్తి. ఇది సీజన్ కావడంతో తన కష్టాలు కొంతైనా తీరతాయన్న ఆశతో వాహనం నడుపుతున్నాడు. అలాంటి వాహనాన్ని ఎలాంటి తప్పు రుజువుకాకుండానే అటవీ కార్యాలయంలో నిలిపివేయడం ఆయనను తీవ్ర మనోవేదనకు గురి చేస్తోంది. బండి నడిస్తేనే ఇంట్లో కడుపు నిండేది... బండి ఆగితే జీవితం ఆగినట్టే అని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చట్టపరమైన చర్య పేరుతో ఒక సామాన్యుడి జీవనాధారాన్ని నిలిపివేయడం ఎంతవరకు న్యాయమన్న ప్రశ్న ఇక్కడ తలెత్తుతోంది.

### పొంతన లేని సమాధానాలు...

వివాద సమయంలో అటవీశాఖ సిబ్బంది ఇచ్చిన సమాధానాల్లో ఏకరూపత లేకపోవడం పరిస్థితిని మరింత తీవ్రం చేసింది. ఒక చోట డీజిల్ కొట్టించుకోవడానికి అన్న మాట, మరో చోట నందిపాడు అటవీ ప్రాంతం వైపు వెళ్లాలన్న వ్యాఖ్యలు వినిపించడం అనుమానాలను పెంచుతోంది. చట్ట అమలు పేరుతో జరుగుతున్న చర్యలు నిజంగా నియమావళి ప్రకారమేనా? అన్న సందేహం ప్రజల్లో బలపడుతోంది. వాహనంలో ఏమీ లేనప్పుడు, దాన్ని అటవీ ప్రాంతాల వైపు తరలించాల్సిన అవసరం ఏమిటి? ఆ చర్య వెనుక ఉద్దేశం ఏమిటి? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు లేకపోవడం తప్పుడు కేసుల భయాన్ని కూడా కలిగిస్తోంది.పొంతన లేని సమాధానాలు :వివాద సమయంలో అటవీశాఖ సిబ్బంది ఇచ్చిన సమాధానాల్లో ఏకరూపత లేకపోవడం పరిస్థితిని మరింత తీవ్రం చేసింది. ఒక చోట డీజిల్ కొట్టించుకోవడానికి అన్న మాట, మరో చోట నందిపాడు అటవీ ప్రాంతం వైపు వెళ్లాలన్న వ్యాఖ్యలు వినిపించడం అనుమానాలను పెంచుతోంది. చట్ట అమలు పేరుతో జరుగుతున్న చర్యలు నిజంగా నియమావళి ప్రకారమేనా? అన్న సందేహం ప్రజల్లో బలపడుతోంది. వాహనంలో ఏమీ లేనప్పుడు, దాన్ని అటవీ ప్రాంతాల వైపు తరలించాల్సిన అవసరం ఏమిటి? ఆ చర్య వెనుక ఉద్దేశం ఏమిటి? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు లేకపోవడం తప్పుడు కేసుల భయాన్ని " కూడా కలిగిస్తోంది.

## మల్లారం రసవత్తర పోరులో కాంగ్రెస్ అభ్యర్థి కటికి కిరణ్ విజయం

**తల్లాడ, మహా:** తల్లాడ మండలంలోని మల్లవరం గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కటికి కిరణ్ కుమార్ విజయం సాధించారు. నామినేషన్ వేసిన నాటినుండి జరిగిన పోరు నువ్వా.. నేనా అన్నట్లుగా ప్రచారం కొనసాగింది. చివరకు కిరణ్ పంచాయతీ బోర్డును కైవసం చేసుకున్నారు. ఆయన ఎన్నో ఏళ్ల నుండి కాంగ్రెస్ పార్టీలో నమ్మిన కార్యకర్తగా పనిచేశారు. పార్టీ అధికారంలో ఉన్నా.. లేకపోయినా పార్టీని అంటిపెట్టుకొని పార్టీ బలోపేతం కోసం కృషి చేశారు. వీటన్నిటిని గమనించిన అధిష్టానం ఆయనకు టికెట్ ను కేటాయించింది. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా కిరణ్ కాంగ్రెస్ జెండాను గ్రామంలో ఎగరవేశారు.




# లంచావతారాల గుట్టు రట్టు!

- రవాణా శాఖలో అవినీతి 'రవాణా'
- ఏసీబీ దాడుల్లో నగదు, పత్రాల స్వాధీనం.
- ఆర్టీఓ ఆఫీసులో 15 మంది దళారుల అరెస్ట్..
- నిబంధనల ఉల్లంఘనపై ఏసీబీ ఉక్కుపాదం
- లంచం అడిగితే 1064కు డయల్ చేయండి
- ఏసీబీ డీఎస్పీ రమేష్ హెచ్చరిక



**ఖమ్మం బ్యూరో, మహా:** ఖమ్మం జిల్లా రవాణా శాఖ కార్యాలయం వేదికగా సాగుతున్న అక్రమ దందాలపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఉక్కుపాదం మోపారు. శనివారం జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ఏసీబీ బృందం నిర్వహించిన మెరుపు దాడులు పెను సంచలనం సృష్టించాయి. గత కొంతకాలంగా ఇక్కడ అవినీతి రాజ్యమేలుతోందని, ప్రతి పనికి లంచం ఇవ్వాల్సిందేనని వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో రంగంలోకి దిగిన అధికారులు, సాక్ష్యాధారాలతో సహా అక్రమాలను నిగ్గుతేల్చారు. ఈ దాడుల్లో భారీగా నగదుతో పాటు, ప్రైవేటు వ్యక్తుల వద్ద ఉన్న ప్రభుత్వ పత్రాలను స్వాధీనం చేసుకోవడం గమనార్హం.ఖమ్మం జిల్లా రవాణా శాఖ కార్యాలయం అవినీతికి నిలయంగా మారిందన్న పక్కా సమాచారంతో ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఒక ఉన్నతాధికారి నేతృత్వంలో సాగిన ఈ దాడుల్లో కార్యాలయ తీరుతెన్నులు చూసి అధికారులు విస్మయానికి గురయ్యారు. ప్రభుత్వ కార్యాలయంలో ఉండాల్సిన కీలక దస్త్రాలు, వాహన నమోదు పత్రాలు , డ్రైవింగ్ లైసెన్స్‌లు ప్రైవేటు వ్యక్తుల వద్ద లభించడం ఇక్కడి అక్రమాలకు అద్దం పడుతోంది. ఈ సోదాల్లో భాగంగా కార్యాలయ ఆవరణలో తిరుగుతున్న 15 మంది దళారులను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి సుమారు 70,000 రూపాయల నగదును, పెద్ద సంఖ్యలో ఆర్సీ కార్డులు, డ్రైవింగ్ లైసెన్స్‌లను స్వాధీనం చేసుకున్నారు.విచారణలో దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. సాధారణంగా ప్రజల ఇళ్లకు నేరుగా చేరాల్సిన వాహన పత్రాలను, దళారుల ద్వారా అధిక మొత్తాలకు విక్రయించేందుకు కార్యాలయంలోనే భద్రపరిచినట్లు తేలింది. కార్యాలయంతో ఎలాంటి సంబంధం లేని వ్యక్తులు ఏకంగా కంప్యూటర్ల ముందు కూర్చుని పనులు చేస్తుండటం అధికారులను ఆశ్చర్యానికి గురిచేసింది. ప్రజల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్న ఈ అక్రమ సొమ్ము ఎవరెవరికి చేరుతుందనే కోణంలో అధికారులు ఆరా తీస్తున్నారు. సోదాల్లో భాగంగా ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లు మరియు కీలక డాక్యుమెంట్లను అధికారులు సీజ్ చేశారు. అక్రమాలకు పాల్పడుతున్న ఒక ఉద్యోగిని అదుపులోకి తీసుకున్న బృందం, అతని నుంచి భారీగా నగదును స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ రమేష్ మాట్లాడుతూ, ప్రభుత్వ అధికారులు తమ విధి నిర్వహణలో లంచం డిమాండ్ చేస్తే సహించబోమని హెచ్చరించారు. అవినీతిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు డిసెంబర్ 3 నుంచి 9 వరకు వారోత్సవాలు నిర్వహించామని గుర్తు చేశారు. ఎవరైనా అధికారులు లంచం ఆశిస్తే వెంటనే 24 గంటల టోల్ ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పట్టుబడ్డ దళారులపై, వారికి సహకరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని, దీనిపై సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఏసీబీ దాడుల వార్త జిల్లావ్యాప్తంగా దావానలంలా వ్యాపించడంతో ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లోని అవినీతి పరుల్లో వణుకు మొదలైంది.



## ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాల అభివృద్ధి



**బూర్గంపహాడ్ మహా:** ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాల అభివృద్ధి చెందుతుందని నూతన సర్పంచులు నిత్యం ప్రజాసేవలోనే ఉంటూ మంచి సర్పంచులు గా పేరు తెచ్చుకోవాలని పినపాక నియోజకవర్గం శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలో ఇటీవల జరిగిన స్థానిక సర్పంచ్ ఎన్నికలలో 18 పంచాయతీలల్లో 13 పంచాయతీలు కాంగ్రెస్ పార్టీ మిత్రపక్షాలు బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులు గెలుపొందడంతో వారిని మండల పార్టీ అధ్యక్షులు దుగ్గెంపుడి కృష్ణారెడ్డి, మాజీ పిఎసిఎస్ చైర్మన్ పోతు రెడ్డి వెంకటేశ్వర రెడ్డి అధ్యక్షతన శనివారం మండల పరిధిలోని పుష్కర వాహనంలో నూతన సర్పంచులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం 22 నెలల కాలంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందించామని అన్నారు. ఇప్పటివరకు ప్రజలకు ఏ సమస్య వచ్చినా నేరుగా తననే కలవాలని ఆ సమస్యను పరిష్కరిస్తూ వచ్చానని ఇకనుంచి గ్రామాలలో సర్పంచులు గా పౌరులుగా మిమ్మలను ప్రజలు ఎన్నుకున్నందున గ్రామాల్లో సమస్యలను పరిష్కరిస్తూ వాటికి కావలసిన నిధులను తనను సంప్రదిస్తూ గ్రామాల అభివృద్ధికి నిస్వార్థంగా సేవ చేయాలని నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తూ మరొక్కసారి ప్రజలే ఎన్నుకునే విధంగా సేవ చేయాలని కోరారు.

## రోడ్డు ప్రమాదంలో కాంగ్రెస్ కార్యకర్త మృతి

### నివాళ్లు అర్పించిన వైరా ఎమ్మెల్యే

**కారేపల్లి, మహా :** కారేపల్లి మండలం గిద్దవారిగూడెం కు చెందిన కాంగ్రెస్ కార్యకర్త కడారి ఉపేందర్ (54) శుక్రవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పత్తి అమ్మటానికి బోలోరో వాహనంలో నెక్కొండ వెళ్లి సీసీఐకి పత్తి అమ్మి తిరిగి గిద్దవారిగూడెం వస్తున్న క్రమంలో మహబూబాబాద్ సమీపంలో బోలోరో వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఢ కొట్టింది. ఈప్రమాదంలో కడారి ఉపేందర్ (54) అక్కడికక్కడే మృతి చెందగా డ్రైవర్ ఎర్రబోడు చెందిన సుంకరి నరేష్‌కి తీవ్రగాయాలు కావటంతో ఆసుపత్రికి తరలించారు. నివాళ్లు అర్పించిన వైరా ఎమ్మెల్యేరోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కడారి ఉపేందర్ మృతదేహాన్ని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ శనివారం సందర్శించారు. గిద్దవారి గూడెంలోని ఉపేందర్ ఇంటికి వెళ్లి ఉపేందర్ మృతదేహంపై కాంగ్రెస్ పతాకాన్ని ఉంచి నివాళ్లు అర్పించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బానోత్ దేవ్లానాయక్, అడ్డగోడ ఐలయ్య. దేగల ఉపేందర్ తదితరులు ఉన్నారు.



మహా పత్రిక

ANN తెలుగు

# ఎమ్మెల్యే ను కలిసిన ఉసిరికాయలపల్లి సర్పంచ్



**కారేపల్లి, మహా:** సింగరేణి మండ పరిధిలోని ఉసిరి కాయలపల్లి గ్రామపంచాయతీ నూతన సర్పంచ్‌గా ఎన్నికైన గుగులోతు వరలక్ష్మి రాజు, శనివారం వైరా ఎమ్మెల్యే రాందాస్  నాయక్ ను కొత్తగూడెం లోని ఎమ్మెల్యే స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సన్మానించి, పుష్పగుచ్చం అందించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాందాస్ నాయక్ వరలక్ష్మి రాజు, కు శుభాకాంక్షలు తెలిపిన అనంతరం మాట్లాడుతూ ఉసిరికాయలపల్లి గ్రామపంచాయతీ అభివృద్ధికి  కృషి చేయాలని, అందుకు తన సహకారం ఎల్లవేళలా ఉంటుందని హామీ ఇచ్చారు. నూతన సర్పంచ్ గా ఎన్నికైన వరలక్ష్మి రాజు, మాట్లాడుతూ తనకు ఓటు వేసి గెలిపించిన ఉసిరికాయలపల్లి ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఉసిరికాయలపల్లి గ్రామపంచాయతీకి అభివృద్ధి కోసం ఎక్కువ నిధులు కేటాయించాలని  ఎమ్మెల్యేను కోరారు ఎమ్మెల్యే ఆశీర్వాదం ఎల్లవేళలా ఉండాలని, అన్నారు ,గ్రామపంచాయతీ అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు.



## భద్రాచలం ఏ ఎస్ పి విశ్రాంతకుమార్ ఆధ్వర్యంలో

# క్యారెడీన్ అండ్ సెర్చ్





**బూర్గంపహాడ్ (భద్రాచలం), మహా:** భద్రాచలం పట్టణంలో సుమారు 150 మంది సిబ్బందితో ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఐపీఎస్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం కార్డెన్ అండ్ సర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ... పట్టణ పోలీసులతో పాటు స్పెషల్ పార్టీ, సిఆర్పిఎఫ్ సిబ్బందితో ఉదయం 4.30 గంటల నుండి 7.30 గంటల వరకు తనిఖీలు నిర్వహించిన్నారు నార్కోటిక్స్ డాగ్ తో రాజుపేట కాలనీలోని సుమారు 300 ఇండ్లను తనిఖీలు నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ సర్చ్‌లో 66 మోటార్ సైకిల్స్, 6 ఆటోలు, 86 లీటర్లు అనుమతి లేని మద్యం సీజ్ చేసినట్లు ఏఎస్పీ వెల్లడించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ... యువత మత్తు పదార్థాలకు అలవాటు పడుతూ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. క్షణికావేషాలకు లోనై హింసాత్మక సంఘటనలకు, దొంగతనాలు, ఇతర చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. తమ ప్రాంతాల్లో ఎవరైనా అనుమానిత వ్యక్తులు సంచరిస్తున్నట్లు తెలిస్తే ప్రజలు అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఇటీవల పట్టణంలో జరిగిన హత్య కేసులో విచారణ ముమ్మరంగా జరుగుతుందని తెలిపారు. అతిత్వరలో నిందితులను పట్టుకుంటామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ నాగరాజు తో పాటు, ఎస్సైలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


# సర్పంచ్‌లను అభినందించిన ఎమ్మెల్యే

**కారేపల్లి, మహా:** సింగరేణి మండలంలో గ్రామపంచాయతీ ఎన్నికలలో విజయం సాధించిన సర్పంచ్‌లను వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ శనివారం అభినందించారు. చీమలపాడు సర్పంచ్ మాలోత్ లలిత, దుబ్బతండా సర్పంచ్ ఆంగోత్ మత్రు లు శనివారం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ను కలిశారు. సర్పంచ్‌లను శాలువకప్పి సన్మానించారు. గ్రామాభివృద్ధి దృష్టి పెట్టి ప్రజాభిమానాన్ని చూరగొనాలని సూచించారు. గ్రామపంచాయతీ అభివృద్ధి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.



## శ్రీ రామకృష్ణ విద్యాలయంలో ఘనంగా శిశువాటిక ప్రారంభం

**ఖమ్మం టౌన్ (నవంబర్ 20 మహా):** గుట్టల బజార్‌లోని శ్రీ రామకృష్ణ విద్యాలయంలో శిశువాటిక విభాగానికి చెందిన నర్సరీ (అరుణ్), ఎల్‌కేజీ (ఉదయ్), యూకేజీ (ప్రభాత్) తరగతుల కోసం పునరుద్ధరించబడిన మరియు సౌందర్యపరంగా మెరుగుపరచిన ప్రీ-ప్రైమరీ తరగతి గదుల ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. చిన్నారులకు అనుకూలంగా, ప్రకాశవంతంగా, ఆనందకరంగా రూపొందించిన ఈ తరగతి గదులు విద్యాభ్యాసాన్ని మరింత ఆసక్తికరంగా మార్చనున్నాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ సరస్వతి విద్యాపీఠం విభాగ్ అధ్యక్షులు శ్రీ దేవకి వాసుదేవరావు  హాజరై, నూతనంగా అభివృద్ధి చేసిన తరగతి గదులను ప్రారంభించి విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో మమేకమయ్యారు. తల్లిదండ్రులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, సమాజంలో జరుగుతున్న అనైతిక చర్యలకు ప్రధాన కారణం సరైన విద్యాభావమేనని, చిన్న వయస్సులోనే నైతిక విలువలు, ఆచరణాత్మక ధర్మబోధన కలిగిన నాణ్యమైన విద్య అవసరమని తెలిపారు.



మహా పత్రిక
ANN తెలుగు

# అధికార పార్టీ ఒత్తిళ్ళకు భయపడవద్దు

## నూతన సర్పంచ్‌ల అభినందనసభలో మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు






**పినపాక(కరకగూడెం),మహా:** అధికార పార్టీ ఒత్తిళ్ళ కు గురిచేసిన భయపడవద్దు... రానున్నది బీ ఆర్ ఎస్ ప్రభుత్వమే అని పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు.కరకగూడెం మండల బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రావుల సోమయ్య అధ్యక్షతన నూతనంగా గెలిచిన బీ ఆర్ ఎస్ ,సిపిఎం బలపరిచిన సర్పంచ్, ఉప సర్పంచ్ లు అభినందన సభ ఏర్పాటు చేయడం జరిగింది.. ఈ అభినందన సభ కి ముఖ్య అతిథిగా హాజరైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు పాల్గొని కరకగూడెం మండల పరిధిలో గెలిచిన ప్రతి బీ ఆర్ ఎస్ సర్పంచ్ లకు శాలువాలు తో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా రేగా కాంతారావు గారు మాట్లాడుతూ, రాబోయే కాలంలో ఎంపీటీసీ, జడ్పిటిసి, మున్సిపల్, ఎన్నికల్లో కచ్చితంగా గులాబీ జెండా ఎగర వేద్దాం. గెలిచిన సర్పంచ్ విజయగర్వంతో కాకుండా నిరంతరం ప్రజా సేవలో ప్రజల మధ్య ఉండాలని సూచించారు. ఓడిపోయిన వారు ఆదేర్య పడోద్దని రాబోయే కాలంలో వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని కోరారు. మనవాళ్ల ను ఎన్ని ఇబ్బందులు పెట్టినా ఆ దైర్యం పడకుండా ధైర్యంతో ముందుకు సాగారు. ఇప్పటికైనా బెదిరింపు రాజకీయాలతో ఏమి సాధించలేరని సూచించారు.. కక్షపూరిత రాజకీయాలు చేస్తే ప్రజలు గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అన్నారు,.ఈ కార్యక్రమంలో మాజీఎంపీపీ రేగా కాళికా నూతన సర్పంచ్, బీ ఆర్ యస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఏస్ జీఎఫ్ అండర్ -19 క్రికెట్

# తెలంగాణ జట్టులో వైష్ణవి రత్న







**పినపాక, మహా:** సంగారెడ్డి లో జరిగిన రాష్ట్రస్థాయి అండర్ 19 క్రికెట్ పోటీల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టు తరపున అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పోలేబోయిన వైష్ణవి రత్న ను తెలంగాణ జట్టుకు ఎంపికైనట్లు సంగారెడ్డి ఎస్ జీ ఎఫ్ సెక్రటరీ గణపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ జీ ఎఫ్ అండర్- 19 క్రికెట్ జాతీయ స్థాయి పోటీలు వచ్చే నెల జనవరి 1 వ తేదీ నుంచి 5 వ వరకు మధ్యప్రదేశ్ రాష్టం శివపురిలో జరుగుతాయని తెలిపారు. మారుమూల ఏజెన్సీ పినపాక మండలం నుంచి అండర్- 19 తెలంగాణ రాష్ట్ర క్రికెట్ జట్టు కు ఎంపికైన పోలేబోయిన వైష్ణవి రత్నను పలువురు అభినందించారు.



# మత్స్యావతారంలో భద్రాద్రి రాముడు

**బూర్గంపాడు(భద్రాచలం),మహా:** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు స్వామివారు మత్స్యావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ మహావిష్ణువు ధరించిన అవతారాల వరుసలో మొట్ట మొదటి అవతారం మత్స్యావతారం. ఈ అవతారానికి సంబంధించి రెండు గాధలు పురాణాలలో ఉన్నాయి. ఒకటి జ్ఞాననిధులైన వేదాలను బ్రహ్మ నుండి అవహరించి సముద్రంలో దాగిఉన్న సోమకాసురుని సహకరించడానికై మత్స్యావతారం ధరించి, వేదాలను ఉద్ధరించాడు. రెండవది జలప్రళయం నుండి నావలో ఉన్న వైవస్వత మనువును, సప్త ఋషులను, సృష్టికి అవసరమైన విత్తనాలను, ఔషధులను రక్షించాడు. ఈ అవతారాన్ని పూజించుట వలన కేతుగ్రహ బాధలు తొలగుతాయి అని భక్తుల భావన. ఈనెల 29న పవిత్ర గోదావరి నదిలో తెప్పోత్సవం, 30న ఉత్తర ద్వార దర్శనం వేడుకలు నిర్వహించనున్నారు.

# జర్నలిస్ట్ ల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి పొంగులేటి



**ఖమ్మం, మహా:** జర్నలిస్టుల అక్రిడిటేషన్ ప్రక్రియ మరో పదిరోజుల్లో ప్రారంభిస్తామని రెవెన్యూ, హౌసింగ్, ఐఅండ్ పీఆర్ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ సంవత్సరం చివరికి అక్రిడిటేషన్ల ప్రక్రియ, వచ్చే ఏడాది జర్నలిస్టుల ఇండ్ల స్థలాల కేటాయింపుపై తీపి కబురు చెబుతామని స్పష్టం చేశారు. ఖమ్మంలోని ఎస్ ఆర్ కన్వెక్షన్లో శనివారం నిర్వహించిన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) జిల్లా మహాసభలను ఉద్దేశించి ఆయన ఫోన్ లో మాట్లాడారు. మహాసభలకు హాజరయ్యేందుకు బయలుదేరిన మంత్రికి సీఎం కార్యాలయం నుంచి ఆకస్మిక పిలుపు రావడంతో హైదరాబాద్ వెళ్లారు. అనివార్య కారణాలవల్ల రాలేక పోతున్నందుకు మన్నించాలని జర్నలిస్టులను కోరిన మంత్రి..తన సందేశాన్ని ఫోన్ ద్వారా వినిపించారు. అక్రిడిటేషన్ కార్డులు, ఇళ్ల స్థలాల సమస్యలను పరిష్కరించేందుకు తెలంగాణ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులు ఎదురుచూస్తున్న అక్రిడిటేషన్ల ప్రక్రియ తుది దశకు చేరుకుందని, వచ్చే పదిరోజుల్లో దీనికి సంబంధించి ప్రభుత్వ ఉత్తర్వులు విడుదల చేస్తామన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి కార్డులు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో జర్నలిస్టుల ఇండ్ల స్థలాల ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. అందువల్ల ప్రత్యామ్నాయ పద్ధతుల్లో ఇండ్ల స్థలాలు ఇచ్చేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కొత్త సంవత్సరం ఆరంభంలో ఇండ్ల స్థలాల విషయమై తీపి కబురు అందిస్తామని చెప్పారు. టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా మహాసభలు ఘనంగా నిర్వహించుకోవడం పట్ల మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. సంఘం రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకత్వానికి అభినందనలు తెలిపారు.





## జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా ఖదీర్, శ్రీనివాస రెడ్డి

ఈ మహాసభల్లో భాగంగా టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షునిగా సయ్యద్ ఖదీర్, కార్యదర్శిగా కొత్తపల్లి శ్రీనివాస రెడ్డి, కోశాధికారిగా తేనె వెంకటేశ్వర్లు, వైస్ ప్రెసిడెంట్ గా సాగర్ దువ్వ, సహాయ కార్యదర్శులుగా జక్కంపుడి కృష్ణ, కూరాకుల గోపి, నాగుల్ మీరా, ఈసీ మెంబర్లుగా కొత్త యాకేష్, నూకల రామచంద్రమూర్తి, అయ్యప్ప, పెంద్ర అంజయ్య, జీ వెంకటేశ్వర్లు, ఎస్కే జానీపాషా, మేడా సంపత్, చల్లా నర్సింహారెడ్డి, కే సుధాకర్, సయ్యద్ అంజాద్, మోహన్ రావు, బీ వెంకటేశ్వర్లు, అచ్చిరెడ్డి, నాగిరెడ్డి, మేకల రమేశ్, కరుణాకర్ రెడ్డి, చంద్రశేఖర్ ఉన్నారు. స్టేట్ కౌన్సిల్ సభ్యులుగా బాలకృష్ణ, నాగేందర్ రెడ్డి, మధుశ్రీ ఎన్నికయ్యారు. తెలంగాణ బ్రాడ్ కాస్టింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా, అధ్యక్ష కార్యదర్శులుగా ఆవుల శ్రీనివాస్, రవికిరణ్ కెమెరామెన్ విభాగం అధ్యక్షునిగా ఫయాజ్, కార్యదర్శిగా గణేష్ ఖమ్మం నగర అధ్యక్ష, కార్యదర్శులుగా తురుగ రామచంద్రమూర్తి, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, వైస్ ప్రెసిడెంట్ గా వీసారపు అంజయ్య, భారతి జాయింట్ సెక్రటరీ గా రామకృష్ణ నాయక్, ఈసీ మెంబర్లుగా శివారెడ్డి ఎన్నికయ్యారు. నేషనల్ కౌన్సిల్ సభ్యులుగా పల్లా కొండల్ రావు, కందికొండ శ్రీనివాస్, బోయినపల్లి అంజయ్య, ఎన్నికయ్యారు.



## జర్నలిస్టులకు అనుకూలంగా ఉంటాం

సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయికాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టులకు అనుకూలంగా ఉంటుందని, వారి సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తుందని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. తన నియోజకవర్గంలో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలతో పాటు పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. జర్నలిస్టులకు ఏ సమస్య వచ్చినా తాను ముందుండి పరిష్కరిస్తానని తెలిపారు.

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి..

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని కాంగ్రెస్ నాయకుడు, మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి అన్నారు. మంత్రి పొంగులేటి కృషితో జర్నలిస్టులకు మంచిరోజులు రానున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సమాజానికి జర్నలిస్టులు చేసే సేవ మహోన్నతమైనదని, తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కూరపాటి ప్రదీప్ అన్నారు. పత్రికలు, చానళ్లు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలని, ఎవరి ప్రలోభాలకు లొంగకుండా ఉండాలని డాక్టర్ యలమంచలి రవీంద్రనాథ్ సూచించారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉన్న జర్నలిస్టులు సమస్యల వెలికితీయడంలో ముందున్నారని కాంగ్రెస్ నాయకుడు తుమ్మల యుగంధర్ అన్నారు.

## భారీ బైక్ ర్యాలీ...

.టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మహాసభల సందర్భంగా భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. సంఘం లోగోతో కూడిన జెండాలను చేతబట్టి, దప్పలదరువులో అమరవీరుల స్థూపం వద్ద ఈ ర్యాలీని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య జెండా ఊపి ప్రారంభించారు. పాత బస్టాండ్, వైరా రోడ్, అంబేద్కర్ సెంటర్ మీదుగా ఇల్లెందు రోడ్ నుంచి శ్రీశ్రీ సర్కిల్ మీదుగా ఎస్ఆర్ కన్వెక్షన్ సెంటర్ కు చేరుకుంది. ఈ సందర్భంగా మార్గమధ్యలో అంబేద్కర్, శ్రీశ్రీ విగ్రహాలకు యూనియన్ రాష్ట్ర, జిల్లా నాయకులు నివాళులర్పించారు. ఈ మహాసభలో టీడబ్ల్యూజేఎఫ్ కార్యదర్శి ఈ చంద్రశేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీ రాజశేఖర్, బుడిగె రఘు యూనియన్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.